క్లుప్తంగా

మర్యాద పూర్వకంగా..



ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కలిసిన శ్రీధర్ వర్మ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్ సర్కిల్) రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

సురక్ష సర్వే పరిశీలన

కడియం: సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందడంలో ఏమైనా సమస్యలు ఉంటే, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం రూపొందించారని ఈవోపీఆర్‌డీ పీవీవీఎస్ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని దుళ్లలో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. వలంటీర్లకు పలు సూచనలు చేశారు.

28న ముళ్లపూడి జయంతి

సీటీఆర్‌ఐ: ప్రముఖ కథా రచయిత, పాత్రికేయుడు, సినీ రచయిత ముళ్లపూడి వెంకట రమణ జయంతిని బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తున్నామని రాకా సాంస్కృతిక సంస్థ ఉపాధ్యక్షుడు రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపు రమణలకు వైద్య సేవలు అందించిన ప్రముఖ డాక్టర్లు టీవీ నారాయణరావు, కంటే వీరన్న చౌదరి, కందుల సాయి, సాహితీ గౌతమి వ్యవస్థాపకుడు పి.విజయ కుమార్, సాహితీవేత్తలు పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ వీరన్న చౌదరి హాస్పిటల్ మెడపై గల బాలు సాంస్కృతిక మందిరంలో జరుగుతుందన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

కడియం: మండలంలోని దుళ్ల బ్రాహ్మణ చెరువు వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ ఎంపీటీసీ తోకల వీరవెంకట్రావు, సచివాలయ కన్వీనర్లు ఉరదాల శ్రీరాములు, సన్నపు బ్రహ్మానందం, ఇందుపరాల శ్రీను, వార్డు సభ్యుడు పిచ్చుక వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. పనుల వివరాలను స్థానిక నాయకులకు ఫీల్డ్ అసిస్టెంట్ వీరబాబు వివరించారు.

ఫీజుల పేరుతో దోపిడీ

కంబాలచెరువు: ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల పేరుతో చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. విద్యారంగ సమస్యలపై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాంపేట మార్కెట్ వద్ద సోమవారం విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 74 లక్షల మంది విద్యార్థులు, 15 వేల ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 32 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.భానుప్రసాద్, జిల్లా నాయకుడు దినేష్ బాబు, పట్టణ కార్యదర్శి ధర్మేష్ కుమార్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కంబాలచెరువు: లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారూ, చేయాలని కోరిన వారూ శిక్షార్హులేనని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రాజకుమారి అన్నారు. స్థానిక ఆనం కళాకేంద్రంలోని మినీ మీటింగ్ హాల్లో సోమవారం పీసీపీఎన్‌డీటీ చట్టంపై రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. డాక్టర్ శ్రీవల్లి మాట్లాడుతూ మహిళ సమాఖ్య సమావేశాల్లో వైద్య సిబ్బంది పాల్గొని అందులో ఒక అంశంగా పీసీపీఎన్‌డీటీ చట్టం, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం గురించి చర్చించాలన్నారు.

చాకుతో ఇద్దరిపై దాడి

రాజమహేంద్రవరం రూరల్: గొడవల నేపథ్యంలో ఒక వ్యక్తి చాకుతో ఇద్దరిని గాయపరిచిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శాటిలైట్ సిటీ సిబ్లాక్‌లో పోలవరపు పాండవులు, బండి దుర్గారావు ఒకే ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరి పిల్లల వల్ల ఇరు కుటుంబాల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి మళ్లీ ఘర్షణ జరిగింది. కోపంతో పాండవులు ఇంటిలో కూరగాయలు కోసే చాకుతో బండి దుర్గారావును, అడ్డువచ్చిన దుర్గారావు అన్నయ్య నరసింగరావును పొడిచి గాయపరిచాడు. వారిని వెంటనే కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలవరపు పాండవులు బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్, ఎస్సై శివాజీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గారావు, నరసింగరావుతో మాట్లాడి, సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఫలించిన పోరాటం

- గ్రాడ్యుటీ కోసం కోర్టుకెళ్లిన కార్మికులు
- ఎట్టకేలకు చెక్కులు అందించిన పవర్ ప్లాంట్ యాజమాన్యం



కార్మికులకు చెక్కులు అందజేస్తున్న సహాయ కార్మిక కమిషనర్ వలీ

సీటీఆర్‌ఐ: వారందరూ సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వర్తించిన కార్మికులు. నెలకు రూ.8 వేల జీతానికి పనిచేసిన వారు. అయితే వారిని యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. కానీ బెనిఫిట్స్ ఇవ్వబోమని కచ్చితంగా చెప్పేసింది. దీంతో కార్మికులందరూ లేబర్ కోర్టును ఆశ్రయించారు. చివరికి వారికి న్యాయం గెలిచింది. లేబర్ కోర్టు వారికి అనుకూలంగా తీర్పునిచ్చింది. కార్మికులు పనిచేసిన కాలంలో వారికి రావాల్సిన గ్రాడ్యుటీని ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. సుమారు 20 సంవత్సరాల తర్వాత తమకు రావాల్సిన గ్రాడ్యుటీని శనివారం రాజమహేంద్రవరంలోని కార్మికశాఖా కార్యాలయంలో కార్మిక సహాయ కమిషనర్ వలీ చేతుల మీదుగా అందుకున్నారు.

సరైన కారణాలు చూపకుండా..

జీవీకే పవర్ ప్లాంట్‌లో 1995లో కొందరు సెక్యూరిటీ గార్డులుగా చేరారు. ఒక్కొక్కరూ సుమారు 8 ఏళ్లకు పైగా విధులు నిర్వర్తించారు. వారికి యాజమాన్యం రూ.8,500 జీతం వేతనంగా ఇచ్చేది. అయితే సరైన కారణాలు చూపకుండా యాజమాన్యం వారిలో కొందరిని ఉద్యోగాల నుంచి తొలగించింది. కార్మికులకు, యాజమాన్యానికి మధ్య చర్చలు కూడా సఫలీకృతం కాలేదు. దీనిలో భాగంగా నలుగురు కార్మికులను యాజమాన్యం 2003లో తొలగించింది. అంతగా చదువుకోలేని కార్మికులకు యాజమాన్యం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ ఎలా పొందాలో అర్థం కాలేదు. వారి సహోద్యోగులకు 2019లో జీవీకే యాజమాన్యం గ్రాడ్యుటీ అందించింది. ఈ విషయం తెలుసుకున్న తొలగించబడిన కార్మికులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం యాజమాన్యాన్ని అడిగారు. అయితే యాజమాన్యం మాత్రమే ససేమిరా బెనిఫిట్స్ ఇచ్చేది లేదని ఖరాఖండిగా చెప్పేసింది. దీనితో వారంతా లేబర్ కోర్టుని ఆశ్రయించారు.

చెక్కులు అందించాం



కార్మికులకు న్యాయపరంగా రావాల్సిన గ్రాడ్యుటీని యాజమాన్యం నుంచి కోర్టు ప్రొసీజర్‌తో రాబట్టడం జరిగింది. కోర్టు ఇచ్చిన ప్రొసిజర్ ప్రకారం వారికి గ్రాడ్యుటీని అందించాం. గతంలో కూడా ఏపీ పేపర్‌మిల్లు కార్మికులకు న్యాయపరమైన గ్రాడ్యుటీని యాజమాన్యం నుంచి రాబట్టగలిగాం.
– బీఎస్ఎం వలీ, సహాయ కార్మిక కమిషనర్

లేబర్ కోర్టును ఆశ్రయించాం



నేను 8,500 జీతానికి జీవీకే పవర్‌ప్లాంట్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేశాను. 8 సంవత్సరాల సర్వీస్ తరువాత నన్ను తొలగించారు. 2019లో లేబర్ కోర్టును ఆశ్రయించగా ఇప్పుడు రూ.21,707 గ్రాడ్యుటీ చెక్కు అందజేశారు.
– వేలంగి లాజరు, కార్మికుడు

ఏడేళ్లు పనిచేశాను



సెక్యూరిటీ గార్డుగా 1995 నుంచి 2002 వరకూ పనిచేశాను. నాకు కారణం కూడా చెప్పకుండా 2003లో విధుల నుంచి తప్పించారు. నాకు రావాలిసిన బెనిఫిట్స్ కోసం లేబర్ కోర్టును ఆశ్రయించగా ఇప్పుడు గ్రాడ్యుటీని అందించారు.
– చొల్లంగి వెంకట రమణ, కార్మికుడు

చెక్కు ఇచ్చారు



నేను సెక్యూరిటీ గార్డుగా 1995 నుంచి 2012 వరకూ అనారోగ్య కారణంగా ఉద్యోగం మానేశాను. అయితే యాజమాన్యం నాకు గ్రాడ్యుటీని ఇవ్వలేదు. దీనితో నేను లేబర్ కోర్టును ఆశ్రయించాను. ఇప్పుడు నాకు రూ.15,946 గ్రాడ్యుటీ అందించారు.
– యనమదల శ్రీనివాసమూర్తి, కార్మికుడు

జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి



కంప్యూటర్‌లో వివరాల నమోదును పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. హుకుంపేట గ్రామ సచివాలయం-1 పరిధిలో జగనన్న సురక్ష గృహ సందర్శన కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటల్ అసిస్టెంట్లు లబ్ధిదారుల వివరాలను ఎలా కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారో పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించి ప్రభుత్వపరంగా, ఇంకా అందాల్సిన పథకాల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామసభ నిర్వహించే తేదీని ముందుగా తెలియజేసి, వారికి ఆరోజు లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలు ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావు పాల్గొన్నారు.

అమ్మఒడితో చదువుకు ఆర్థిక ఆసరా



వీరభద్రపురం పాఠశాలలో మాట్లాడుతున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: తల్లిదండ్రులు తమ పిల్లల చదువు విషయంలో ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక వీరభద్రపురం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల కమిటీతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఐ దిలీప్ కుమార్ మాట్లాడుతూ బుధవారం తల్లుల ఖాతాల్లో జమచేయనున్న అమ్మఒడికి సంబంధించిన ముఖ్యమంత్రి సందేశాన్ని తల్లిదండ్రులకు టీవీ ద్వారా వినిపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొండ్రేటి నరేష్, ఉపాధ్యాయులు శివాజీ తమ సొంత ఖర్చుతో సమకూర్చిన నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరేజర్లను ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు డీఐ దిలీప్ కుమార్ పంపిణీ చేశారు. వీరభద్రపురం ప్రాథమిక పాఠశాలలో ప్రతి నెలా నూరుశాతం హాజరైన విద్యార్థికి ఒక మెడల్ అందజేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు నరేష్ తెలిపారు.

ప్రగతి పథంలో ప్రభుత్వ పాఠశాలలు

ముఖ్యమంత్రి జగన్ తీసుకుంటున్న ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలలన్నీ ప్రగతి పథంలో నడుస్తున్నాయని నాగరాజా నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి సోమవారం పేరెంట్స్ కమిటీతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమ్మఒడికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సందేశాన్ని తల్లిదండ్రులకు వీడియో రూపంలో వినిపించారు. పేరెంట్ కమిటీ చైర్ పర్సన్ జి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

కంబాలచెరువు: ఒంటరిగా ఉన్న వ్యక్తుల నుంచి డబ్బులు లాక్కుంటున్న లింగపేటకు చెందిన ఇద్దరు పాత నిందితులను త్రీటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ జి.మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం... కాతేరుకు చెందిన ఒక యువకుడు ఈనెల 23న తన తల్లితో గొడవపడి ఆమెపై కోపంతో ఇంటి నుంచి బయటకు వచ్చేసి కోటిలింగాఘాట్‌లోని శివుని విగ్రహం వద్ద నిద్రపోతున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు వ్యక్తులు అతడిని కొట్టి చంపుతానని బెదిరించి, జేబులోని రూ.300 లాక్కుకు వెళ్లిపోయారు. బాధితుడు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దృష్టిసారించిన సీఐ కేసు విచారణను ఎస్సై షేక్ అమీనాబేగానికి అప్పగించారు. దీనిపై వివరాలు సేకరించిన పోలీసులు దుర్గాప్రసాద్, ఇంద్రకిరణ్‌లను నిందితులుగా గుర్తించారు. వారిని పట్టుకుని కోర్టుకు హాజరుపర్చారు. వారిని రిమాండ్ విధించడంతో సెంట్రల్ జైలుకి తరలించారు. దుర్గాప్రసాద్‌పై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఇంద్రకిరణ్ పాత కేసులో ముద్దాయిగా ఉన్నాడు.

అంగన్‌వాడీల ఆందోళన

కడియం: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు సోమవారం కడియంలో ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి జెండా ఊపి ప్రారంభించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బేబీరాణి, ఉపాధ్యక్షులు అన్నపూర్ణ, రాజానగరం ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.మార్త, కార్యదర్శి వై.సుజాత పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ భరత్ రామ్

- ఎంపీ భరత్ రామ్
- 28వ డివిజన్‌లో గడప గడపకూ

రాజమహేంద్రవరం సిటీ: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం నగరంలోని 28వ డివిజన్ ఇన్‌చార్జి బిల్డర్ చిన్నా ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్.. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాలకు పైగా 480 గజాలలో 11 కుటుంబాలకు చెందిన సభ్యులం నివసిస్తున్నామని, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. ఇంటి, కుళాయి, విద్యుత్ పన్ను తదితర ఆధారాలు తీసుకుని కార్యాలయానికి వస్తే భూ హక్కు పట్టాలు ఇప్పిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ఇన్‌చార్జి కొత్త విజయ రాజ్యలక్ష్మి, సంకిస భవానీ ప్రియ, పోలు విజయలక్ష్మి, ఎన్వీ శ్రీనివాస్, ఆరే చిన్ని, రాయుడు గణేష్, గుత్తుల భాస్కర్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న సురక్ష



స్పందనలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సురక్ష నమోదు, స్పందన, జేకేసీ అర్జీల పరిష్కారంలో నాణ్యమైన పనితీరు చూపాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షలో ఇంటింటి సర్వే నిర్వహించే క్రమంలో ఆయా వలంటీర్లతో సచివాలయ వార్డు కార్యదర్శులు కచ్చితంగా పర్యటించాలన్నారు. స్పందనకు 19 అర్జీలు వచ్చాయని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సత్యవేణి, ఎస్ఈజీ పాండురంగారావు, సిటీ ప్లానర్ వైబీఆర్ చంద్రబోస్ పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానానికి మొక్కల వితరణ



మొక్కలను పంపిస్తున్న రైతులు

కడియం: మండలంలోని శ్రీములసమ్మ ఆలయం వద్ద నుంచి శ్రీశైలం దేవస్థానానికి సోమవారం మొక్కలను పంపించారు. రైతులు కటికిరెడ్డి వెంకన్నబాబు, పెద్దిరెడ్డి శ్రీనివాస్, అనిశెట్టి వేణు, నాగిరెడ్డి రవి, చల్లా దుర్గయ్య వీటిని సమకూర్చారు. ఈ మొక్కలను దేవస్థానం వాహనంపై తరలించారు. శ్రీశైలం ఆలయ పార్కింగ్ ప్రదేశాలలో వీటిని నాటుతారని రైతులు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో యువత నిర్వీర్యం



ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్ సోమశేఖర్

కంబాలచెరువు: మాదక ద్రవ్యాల వినియోగంతో సమాజం ముఖ్యంగా యువత బలహీనంగా, నిర్వీర్యంగా మారుతున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా, క్రయ విక్రయాలు, తీసుకోవడం, తయారీలో సహకరించడం నేరాలన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.జయపాల్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పీఎస్ శాస్త్రి, న్యాయవాది జి.అనంతరావు, త్రీటౌన్ సీఐ జి.మధుబాబు పాల్గొన్నారు.

▸▸ సౌత్ జోన్ డీఎస్పీ శ్రీనివాసులు సారథ్యంలో రెండో పట్టణ సీఐ టి.గణేష్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ అడిక్షన్ సెంటర్ డాక్టర్ సుందర్‌రాజు, కళాశాల ప్రిన్సిపాల్ నేతృత్వంలో సుమారు 300 మందికి పైగా విద్యార్థులతో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ ర్యాలీ కొనసాగింది.

▸▸ సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్ ఆధ్వర్యంలో లాలాచెరువు నుంచి ఏవీ అప్పారావు రోడ్డు మీదుగా రామాలయం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సెకండెంట్ కమాండెంట్ జి.సురేష్ బాబు, జి.సెంథిల్ కుమార్, బి.రత్తమ్మ, జగదీష్ సింగ్ షెకావత్, డాక్టర్ జె.నితిన్ పాల్గొన్నారు.

కడియంలో ర్యాలీ

కడియం: మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి చేటు అని కడియం ఎస్సై కె.ఆంజనేయులు అన్నారు. కడియం పోలీసులు, వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులు సోమవారం కడియంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం కారణంగా ఎదురయ్యే శారీరక, మానసిక, సామాజిక ఇబ్బందులను వివరించారు.

సరైన మార్గంలో నడుచుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): యువత చెడుదారుల్లో వెళ్లకుండా సరైన మార్గంలో నడుచుకోవాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) జాయింట్ డైరెక్టర్ (ఏఎస్పీ) పిట్టా సోమశేఖర్ సూచించారు. సెబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. దీనిని సోమశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. వై.జంక్షన్ నుంచి దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా పుష్కరాల రేవు వరకూ ర్యాలీ జరిగింది. గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం తెలిస్తే సెబ్ టోల్‌ఫ్రీ నంబర్‌కు 14500కు తెలియజేయాలన్నారు. రాజమహేంద్రవరం ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు పీవీ రమణ, పి.హనుశ్రీ, వి.అప్పారావు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

ధవళేశ్వరం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజమహేంద్రవరం సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు అన్నారు. స్థానిక వివేకానంద ఐటీఐ విద్యార్థులతో కలిసి కాటన్ బ్యారేజీ వరకూ ర్యాలీ నిర్వహించారు. సీఐ కె.మంగాదేవి, డ్రగ్ అడిక్షన్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ సుందరరాజు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

సీటీఆర్‌ఐ: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.చైత్రవర్షిణి అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ ఆక్రమణ, రేషన్ కార్డులు, తాగునీరు, సర్వే తదితర అంశాలపై ఏడుగురు అర్జీలు అందజేశారు. ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జీఎల్ఎస్ దేవి పాల్గొన్నారు.

28న బస్సుయాత్ర

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో బుధవారం జరిగే భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథయాత్ర (బస్సుయాత్ర)ను విజయవంతం చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నివాసంలో టీడీపీ ముఖ్యనాయకులతో చైతన్య రథయాత్ర రూట్‌మ్యాప్‌పై చర్చించారు.

ఆర్టీసీ టికెట్లపై పదిశాతం రాయితీ

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రాకపోకలకు ఒకేసారి రిజర్వేషన్ టిక్కెట్లు కొనుగోలు చేస్తే పదిశాతం రాయితీ ఇవ్వనున్నట్లు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ రాయితీ రాజమహేంద్రవరం డిపో నుంచి నడుస్తున్న సర్వీసులకు వర్తిస్తుందన్నారు. రాజమహేంద్రవరం – హైదరాబాద్ (బీహెచ్ఈఎల్), రాజమహేంద్రవరం – హైదరాబాద్ (జీడిమెట్ల), శ్రీశైలం, గుంటూరు, విజయవాడ (ఆల్ట్రా డీలక్స్) తిరుపతి, విశాఖపట్నం, విశాఖపట్నం (ఆల్ట్రా డీలక్స్), ఇచ్ఛాపురం (ఎక్స్‌ప్రెస్), భద్రాచలం (ఎక్స్‌ప్రెస్) వయా కుక్కునూరు, భద్రాచలం (వయా మారేడుమిల్లి) బస్సులకు వర్తిస్తుందన్నారు. దీన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్కూటీలను వెంటనే పంపిణీ చేయాలి

ధవళేశ్వరం: జిల్లాలోని దివ్యాంగులకు కేటాయించిన 70 స్కూటీలను వెంటనే పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పోసికుమార్ మాట్లాడుతూ జిల్లాకు సుమారు 70 స్కూటీలు మంజూరు అయ్యాయని, అయితే పంపిణీ విషయంలో జాప్యం జరుగుతుందన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సదరమ్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతోందన్నారు.

వీఎస్ఎస్ భూములకు నష్టపరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సీటీఆర్‌ఐ: పోలవరం ముంపు గ్రామాల్లోని 40 వేల ఎకరాల వీఎస్ఎస్ భూములకు తక్షణం పరిహారం చెల్లించాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లోని పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్) భూములు ముంపునకు గురవుతున్నాయన్నారు. వీటిపై వనసంరక్షణ సమితి సభ్యులకు నష్టపరిహారం చెల్లించే విషయమై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త ఇటీవల ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు భూసేకరణ స్పెషల్ కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. ఈనెల ఒకటిన ఢిల్లీలో జరిగిన పోలవరం ప్రాజెక్టు సమావేశంలో కూడా దీనిపై చర్చించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. సుమారు 8 మండలాల్లోని 373 గ్రామాల పరిధిలో లక్షాఆరువేల కుటుంబాలు ఈ వన సంరక్షణ సమితి పరిధిలో ఉన్నాయన్నారు.

తల్లి చెంతకు సురక్షితంగా బాలుడు



బాలుడిని తల్లికి అప్పగించిన జీఆర్పీ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: రైలులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న బాలుడిని గుర్తించి, సురక్షితంగా అతడి తల్లికి అప్పగించినట్లు జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు సోమవారం తెలిపారు. అనపర్తి మండలం కొంకుదురుకు చెందిన ఏడేళ్ల రాయుడు అనిల్ తల్లి హైదరాబాద్‌కు కూలి పనికి వెళ్లింది. దీంతో గ్రామంలో అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అమ్మమ్మ మందలించడంతో అనపర్తిలో గౌతమీ ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు. రైలులో ఆ బాలుడిని గుర్తించిన ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన జీఆర్పీ పోలీసులు రైల్లోని బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. సోమవారం తల్లిని రప్పించి సురక్షితంగా అప్పగించారు.

గోవధ నిరోధక చట్టం అమలు చేయాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోవధ నిషేధమని, గోవులను అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేసిచట్ట పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్‌జీటీ సత్యగోవిందు అన్నారు. ఈనెల 29వ తేదీన బక్రీద్‌ను పురస్కరించుకుని గోవధ జరగకుండా చట్టాన్ని పరిరక్షించడానికి, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను నిరోధించడానికి సంబంధిత శాఖలు, జిల్లా జంతుసంరక్షణా సంఘం సభ్యులతో సోమవారం జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సహకారంతో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, తగినంతమంది సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. డివిజనల్ రెవెన్యూ అధికారుల సహకారంతో వారి పరిధిలోని తహసీల్దార్లు గోవధ నిషేధ చట్టం అమలుపై సూచనలు చేయాలన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముస్లిం సంస్థలు, నాయకులతో సమన్వయం చేసుకుని గోవధ నిషేధ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు.

గోవధకు పాల్పడకుండా చర్యలు

కంబాలచెరువు: హైకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 29న బక్రీద్ పండగ నేపథ్యంలో జిల్లాలో గోవధకు పాల్పడకుండా చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి యానిమల్ వెల్ఫేర్ బోర్డు మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. పర్యవేక్షణకు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా ఎస్పీ, ఎస్పీసెల్ డీఎస్పీ సీహెచ్ శ్యామలరావును నియమించామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.